సాక్షి తూర్పుగోదావరి

మంగళవారం । 25 । ఏప్రిల్ । 2023



రుణగొణ ధ్వనులకు మంగళం


పొదుపు సంఘాల లెక్కలు ఇకపై పక్కాగా ఉండనున్నాయి. పొందే రుణాలు, వారు చెల్లిస్తున్న వడ్డీ, పొదుపు వివరాల్లో పూర్తి పారదర్శకత చోటు చేసుకోనుంది. - 8లో▸



ఘనంగా వైదిక కార్యక్రమాలు

సత్యదేవుని కల్యాణ మహోత్సవాలలో స్వామి, అమ్మవార్లకు నిర్వహించే వైదిక పరమైన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని ఈఓ అజాద్ ఆదేశించారు. - 8లో▸

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం డెల్టా కాలువలకు 3,250 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 800, మధ్య డెల్టాకు 650, పశ్చిమ డెల్టాకు 1,800 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న సర్పంచ్ స్టాలిన్



తాడేపల్లిలో మాట్లాడుతున్న యాదల సతీష్‌చంద్ర స్టాలిన్

కడియం: ఉమెన్ ఫ్రెండ్లీ విభాగంలో రాష్ట్ర స్థాయి అవార్డును జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ సోమవారం అందుకున్నారు. ఈ మేరకు తాడేపల్లిలోని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ సూర్యకుమారి, అడిషనల్ కమిషనర్ సుధాకర్, సత్యనారాయణ ఈ పురస్కారం ప్రదానం చేశారు. పరిపాలనావరంగా తీసుకున్న చర్యలను సభా వేదికపై స్టాలిన్ వివరించారు.

29న వాహనాల వేలం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాజమహేంద్రవరం సౌత్‌స్టేషన్ పరిధిలో సారా, ఇతర నేరాల్లో పట్టుకున్న 9 మోటారుసైకిళ్లు, ఇంజిన్ బోటుకు ఈనెల 29వ తేదీ ఉదయం 8 గంటలకు స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ సోమవారం ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు, రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. వాహనాలు దక్కించుకున్నవారు పాడిన మొత్తాన్ని వెంటనే చెల్లించాలన్నారు. డిప్యూటీ కమిషనర్(విజయవాడ) జీఎస్టీ నంబర్‌కు 18శాతం జీఎస్టీ జమ చేయాలన్నారు. ఇతర వివరాలకు 94409 02411, 96187 33879 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

లేఅవుట్ నిబంధనలపై అవగాహన



సర్టిఫికెట్లు అందజేస్తున్న రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే లైసెన్సుడ్ సర్వేయర్లు రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) నిబంధనలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. స్థానిక రుడా కార్యాలయంలో సోమవారం లైసెన్సుడ్ సర్వేయర్లకు లేఅవుట్ నిబంధనలపై అవగాహన కల్పించారు. షర్మిలారెడ్డి మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ అప్లికేషన్లపై వచ్చిన పెండింగ్ దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే కార్యాలయంలోని ప్లానింగ్ విభాగంలో సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా కొందరు ఇంజినీర్లకు లైసెన్సుడ్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రుడా ప్లానింగ్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రులు విడదల రజని, చెల్లుబోయిన వేణు తదితరులు



జ్యోతిరావుపూలే, అంబేద్కర్ భవన నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు విడదల రజని, చెల్లుబోయిన వేణు, తానేటి వనిత, ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, షర్మిలారెడ్డి

ఈ ఏడాదే వైద్య తరగతులు

- మెడికల్ కాలేజీ భవనాలను పరిశీలించిన వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రజిని
- జోరుగా సాగుతున్న నిర్మాణ పనులపై సంతృప్తి
- శ్రీరంగపట్నం కళాకారులకు సాయం అందజేత
- పూలే, అంబేద్కర్ భవనానికి శంకుస్థాపన
- పాల్గొన్న మంత్రులు వేణు, వనిత, ఎంపీ భరత్, ఎమ్మెల్యే రాజా

సాక్షిప్రతినిధి, రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరంలోని కొత్తగా మంజురైన మెడికల్ కాలేజీలో ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభమవుతాయని వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. సోమవారం ఆమె తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం, రాజానగరం నియోజకవర్గాల్లో పర్యటించారు. మంత్రులు చెల్లుబోయిన వేణు, తానేటి వనితలతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రెండు నియోజకవర్గాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

ఈ ఏడాది నుంచే మెడికల్ క్లాసులు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ప్రతిష్టాత్మకంగా రూ.475 కోట్లతో చేపట్టిన రాజమహేంద్రవరం మెడికల్‌కాలేజీ పనులను మంత్రి రజిని సమీక్షించారు. హాస్టల్ భవనాలను చూశారు. మొదటి, రెండు సంవత్సరాల తరగతులు నిర్వహించేందుకు వీలుగా చేపట్టిన అంతస్తుల నిర్మాణ ప్రగతిపై ఏపీహెచ్‌ఎంహెచ్ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ మాధవీలత, ఎంపీ, ఎమ్మెల్యేలు భరత్ రామ్, జక్కంపూడి రాజాలతో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో మంజూరైన రాజమహేంద్రవరం మెడికల్ కాలేజీ నిర్మాణం త్వరితగతిన జరుగుతోందంటూ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచే 150 ఎంబీబీఎస్ సీట్లతో క్లాసులు ప్రారంభం కానున్నాయనే తీపి కబురు అందించారు. సమీపాన ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వార్డులను నిశితంగా మంత్రి రజిని పరిశీలించారు. కొందరు రోగుల వద్దకు వెళ్లి మాట్లాడారు. ప్రసూతి వార్డు సహా ఇతర వార్డులను పరిశీలించారు. మందులు, భోజన వసతి, వైద్య సేవలపై ఆరా తీశారు.

భరత్ కృషికి తార్కాణం

గోదావరి గట్టుపై స్థానిక ఎంపీ భరత్‌రామ్ కృషితో నిర్మాణం చేపడుతోన్న జ్యోతిరావు పూలే, అంబేద్కర్ భవనానికి మంత్రులు తానేటి వనిత, చెల్లుబోయిన వేణు, విడదల రజిని శంకుస్థాపన చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు దేశానికి రోల్‌మోడల్‌గా నిలుస్తున్నాయని ఈ సందర్భంగా మంత్రులు పేర్కొన్నారు. భవన నిర్మాణంలో ఎంపీ భరత్ కృషిని మంత్రులు ప్రశంసించారు. చైతన్యవంతమైన రాజమహేంద్రవరంలో బడుగు, బలహీనవర్గాల కోసం తలపెట్టిన ఈ భవన నిర్మాణాన్ని ఏడాదిన్నరలో పూర్తి చేస్తామని ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రకటించారు. అనంతరం రాజానగరం నియోజకవర్గంలో మంత్రులు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.



రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో రోగిని పరిశీలించి మాట్లాడుతున్న మంత్రి రజిని

జక్కంపూడి కృషితో వైద్యసేవలు

కోరుకొండ మండలం కోటికేశవరంలో రూ.1.54 కోట్లతో నాడు–నేడులో నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని మంత్రులు ప్రారంభించారు. ఈ పీహెచ్‌సీ నిధుల కోసం కృషి చేసి 25 వేల మందికి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు ఎల్లప్పుడూ అండగా ఉండాలని మంత్రులు విజ్ఞప్తి చేశారు. తండ్రి దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావు స్ఫూర్తితో నిత్యం ప్రజల్లో ఉండే రాజాకు ఉజ్వల భవిష్యత్ ఉందని ప్రశంసించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌కు ఈ పీహెచ్‌సీలో ఉన్న ఇద్దరు వైద్యులలో ఒకరిని ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే రాజా తెలిపారు.

ప్రమాద బాధితులకు సాయం

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీరంగపట్నం కళాకారులు నలుగురికి రూ.2 లక్షలు వంతున, క్షతగాత్రులు ఎనిమిది మందికి రూ.లక్ష వంతున ప్రభుత్వ ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు నాయకులు అందజేశారు. కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, ఏపీహెచ్‌ఎంహెచ్ఐడీసీ ఎండీ ఎస్.మురళీధరరెడ్డి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీఎల్‌టీఓ డాక్టర్ ఎన్ వసుంధర, డీఎస్ఎంఓ పి.లక్ష్మీదేవి,వైఎస్సార్ సీపీ యువజన విభాగం ప్రాంతీయ అధ్యక్షుడు జక్కంపూడి గణేష్, రాజానగరం నియోజకవర్గ పరిశీలకులు వట్టికూటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి



డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి

రాజమహేంద్రవరం రూరల్: మలేరియా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, దీనిలో భాగంగా మంగళవారం రాజమహేంద్రవరంలో ర్యాలీ నిర్వహిస్తున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా స్థానిక వై.జంక్షన్ వద్ద ఈ కార్యక్రమాన్ని ఉదయం 9.30 గంటలకు కలెక్టర్ మాధవీలత ప్రారంభిస్తారన్నారు. జిల్లాలో మలేరియా కేసులు 2020లో 9, 2021లో 6, 2022లో ఒకటి, 2023లో ఇంతవరకు ఒకటి నమోదయ్యాయన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా పరీక్ష కిట్లు, మందులు అందుబాటులో ఉంచి, వెంటనే నిర్ధారణ పరీక్షల జరిపి మందులు అందిస్తున్నామన్నారు. వ్యాధి ప్రభలకుండా ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. హైరిస్క్ ప్రాంతాల్లోని పెద్ద నీటి నిల్వల్లో 5 లక్షల గంబూషియా చేపపిల్లలను విడిచిపెట్టడానికి ప్రణాళిక సిద్ధం చేశామని, జిల్లాలో 68 హాస్టళ్లలో ఇండోర్ రెసిడూట్స్ స్ప్రే (ఐఆర్ఎస్) చేయడానికి జూన్ నుంచి యాక్షన్ ప్లాన్ అమలు చేశామని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో ప్రతి శుక్రవారం ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమం ద్వారా ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చేస్తున్నామన్నారు.

జగనన్నే మా భవిష్యత్ అంటున్న జనం

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై సంపూర్ణ విశ్వాసం
- హోంమంత్రి తానేటి వనిత

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనపై ప్రజలంతా ముక్తకంఠంతో సానుకూల అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగనన్నే మా నమ్మకం పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సర్వేలో ఇప్పటి వరకూ కోటి కుటుంబాలను కలిశామన్నారు. ఇందులో 80 లక్షల మందికి పైగా తమ పాలనకు మద్దతు ప్రకటించారన్నారు. సర్వేకు విశేష స్పందన లభిస్తోందన్నారు. రాష్ట్రంలో 1.65 లక్షల కుటుంబాలు ఉండగా, 15 వేల సచివాలయాల పరిధిలో ఏడు లక్షల మంది సర్వే చేపట్టారన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేస్తున్నామన్నారు. పార్టీలు, కుల, మతాలకు అతీతంగా పథకాలు అమలు చేయడం ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసాన్ని నింపగలిగిందన్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు 79,007 కుటుంబాలను కలిస్తే 62,867 మంది ప్రభుత్వ పాలనపై సానుకూలత వ్యక్తం చేశారన్నారు.

చంద్రబాబు బురదజల్లుడు

ప్రతి నెల ఒకటో తేదీన ఇంటికే తీసుకెళ్లి ఫించన్ అందించడంపై వృద్ధులు,దివ్యాంగులు తమ ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తున్నారని మంత్రి చెప్పారు. వివిధ పథకాలపై సంతోషం వెలిబుచ్చుతున్నారన్నారు. అన్నీ వర్గాల ప్రజలు జగనన్నే మా భవిష్యత్ అని, మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తున్నారని వనిత పేర్కొన్నారు. చంద్రబాబు ప్రజల్లోకి వెళ్లే అవకాశం లేదన్నారు. ఒక్క మంచి పని కూడా చేశామని ప్రజలకు చెప్పుకోలేని దౌర్భగ్య స్థితిలో ప్రతిపక్ష టీడీపీ ఉందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పైనా, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపైనా బురద జల్లడం ద్వారా లబ్ధి పొందాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇందుకోసం పచ్చ మీడియాను అడ్డు పెట్టుకుంటున్నారన్నారు. ఎదిగే కొద్ది ఒదిగి ఉండాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. మ్యానిఫెస్టోలో పేర్కొన్న 98 శాతానికి పైగా హామీలను అమలు చేసి చూపించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. జగనన్నే మా నమ్మకం కార్యక్రమం ద్వారా కోటి మందికి పైగా కుటుంబాలను కలుసుకున్న ఫ్లెక్సీ పోస్టర్‌ను మంత్రి వనిత ఆవిష్కరించారు. మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ గంగ్రోతు అంజనీదేవి, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, ఆత్కూరి దొరయ్య, సలాది సందీప్, గన్నమని వీర వెంకట రాజు, రుత్తల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు క్యాంపు కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హోంమంత్రి తానేటి వనిత తదితరులు

సమస్యల పరిష్కారానికి వ్యక్తిగత పర్యవేక్షణ



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రజా సమస్యల పరిష్కారం కోసం మండల, ప్రత్యేక అధికారులు వ్యక్తిగత పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్‌తో కలిసి ప్రజల నుంచి స్పందన ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో ప్రజల నుంచి 130 అర్జీలు స్వీకరించామన్నారు. వాటిలో ఏఒక్క అర్జీ తిరిగి రాకుండా అధికారులు వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రతి రోజూ 3 నుంచి 5 గంటల వరకు ఆయా సచివాలయ కార్యదర్శులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని సచివాలయాల్లో తనిఖీ నిర్వహించాలన్నారు. తిరిగి వస్తున్న అర్జీల పరిష్కార కోసం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని, అమలు చేసే బాధ్యత మండల ప్రత్యేక అధికారులదేనని స్పష్టం చేశారు.

అరుణాచలం యాత్రకు బస్సు సర్వీసులు

అమలాపురం రూరల్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అమలాపురం డిపో నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణ యాత్రకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఈ యాత్రలో కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, కంచి, శ్రీకాళహస్తి, విజయవాడ ప్రాంతాలలోని దేవాలయాల దర్శనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మే మూడో తేదీన అమలాపురం డిపో నుంచి బస్సు బయలుదేరి క్షేత్రాలు దర్శించటంతోపాటు ఐదో తేదీ శుక్రవారం పౌర్ణమి సందర్భంగా అరుణాచల గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత ఏడవ తేదీ ఆదివారం తిరిగి అమలాపురం వస్తుందన్నారు. పుష్ బ్యాక్ 2 ప్లస్ 2 సిట్టింగ్ కలిగిన సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేశామన్నారు. పెద్దలకు సూపర్ లగ్జరీ బస్సుకు టికెట్ ధర రూ.2,950, పిల్లలకు రూ.2200, ఇంద్రా ఏసీ బస్సుకు పెద్దలకు రూ.4,000, పిల్లలకు రూ.3,000 గా నిర్ణయించామన్నారు. వివరాలకు 7013868687, 9959225576, 9959225550 నంబర్లలో సంప్రదించవచ్చునని తెలియజేశారు.

డీఎస్సీ- 98లో మిగిలిన వారికీ నియామక అనుమతి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): డీఎస్సీ–98లో మిగిలిన అభ్యర్థుల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని జిల్లా విద్యాశాఖాధికారి కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ సోమవారం తెలిపారు. జాబితాలో ఉన్న 285 సెకండరీ గ్రేడ్ అభ్యర్థులలో ఇప్పటికే 260 మందికి నియామక ఉత్తర్వులు ఇచ్చామన్నారు. మిగిలిన అభ్యర్థులు మినిమం టైం స్కేల్ ద్వారా పనిచేయడానికి అంగీకరిస్తే ఈ నెల 27వ తేదిన జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి హాజరుకావాలని సూచించారు. అభ్యర్థుల జాబితా జిల్లా విద్యాశాఖాధికారి వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు.


జీరో మలేరియా దిశగా...

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మలేరియాపై పైచేయి
- ప్రత్యేక చర్యలతో గణనీయంగా తగ్గిన కేసులు
- నేడు అంతర్జాతీయ మలేరియా నివారణ దినోత్సవం

కాకినాడ క్రైం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మలేరియా నివారణకు ప్రభుత్వ చొరవ, అధికారుల కృషి సత్ఫలితాలనిచ్చింది. ఇందుకు అనుసరిస్తున్న శాస్త్రీయ విధానాలన్నీ సఫలీకృతమవుతున్నాయి. గడచిన ఐదేళ్ల గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం సుస్పష్టమవుతోంది. నాలుగేళ్ల క్రితం కేసుల సంఖ్యలో ఇప్పుడు నమోదవుతున్న కేసుల సంఖ్య 10 శాతమే కావడం మలేరియా నియంత్రలో పురోగతిని స్పష్టం చేస్తుంది. సాంప్రదాయ పద్ధతులు, శాస్త్రీయ విధానాలు, ప్రజల వ్యక్తిగత శుభ్రత మలేరియా నియంత్రణకు దోహపడ్డాయని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి తెలిపారు. దోమల నివారణకు సిబ్బంది ఆరు రకాల విధానాలను అనుసరిస్తారు. ఆయా విధానాల్లో నాలుగు దోమల నివారణకు అనుసరిస్తే మిగిలిన రెండు లార్వా నివారణకు వినియోగిస్తామని జిల్లా మలేరియా అధికారి(డీఎంవో) సింగంశెట్టి భాస్కరరావు అన్నారు.

దోమల నివారణకు..

దోమలను రూపుమాపడానికి అనుసరించే ఫాగింగ్ విధానంలో పైరత్రం, టెక్నికల్ మాలాథిన్ వాడుతారు. దోమల సాంద్రత అధికంగా ఉన్న చోట వారానికి రెండు సార్లు ఫాగింగ్ చేస్తారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాలలో పాటు దోమలు అధికంగా ఉండే అర్బన్ ప్రాంతాల్లోనూ ఈ విధానం ద్వారా దోమల నివారణ చేపడతారని భాస్కరరావు తెలిపారు. స్పేస్ స్ప్రే ద్వారా సైఫనోత్రిన్‌ను ఇళ్ల ఆవరణల్లో పిచికారీ చేస్తారు. దీని వల్ల భూ ఉపరితలం ఉంచి 50 నుంచి 100 అడుగుల ఎత్తులో ఉన్న దోమలు సైతం హతమవుతాయి. దోమల వల్ల వ్యాధులు ప్రభలుతున్న ప్రాంతాల్లోనే స్పేస్‌స్ప్రేను వినియోగిస్తారు. మరో విధానం ఐఆర్ ఎస్(ఇండోర్ రెసిడ్యుయల్ స్ప్రే) విధానంలో ఆల్ఫా సైపర్ మెత్రిన్ రసాయనాన్ని ఇంటి లోపల గోడలపై పిచికారీ చేస్తారు. గోడ మీద వాలి ద్రావణాన్ని దోమ తిని మరణిస్తుంది. 10 నుంచి 12 వారాల వరకు ప్రభావం ఉంటుంది. దోమల నియంత్రణలో వాడే నాల్గవ విధానం దోమతెరలు (బెడ్‌నెట్స్) వీటిలో లాంగ్ లాస్టింగ్ ఇన్సెక్టిసైడల్ నెట్స్ అంటారు. శాస్త్రీయ విధానాన్ని రంగరించి సిద్ధం చేసిన ఈ దోమ తెరలను రాష్ట్రం థాయిలాండ్ నుంచి కొనుగోలు చేస్తుంది. వీటి తయారీ అనంతరం ప్రత్యేక రసాయనంలో ఉంచి వినియోగంలోకి తెస్తారు. వీటినే జిల్లా వాసులకు అందజేశారు. తెరపై ఉండే డాక్సీసైక్లిన్ రసాయనం తెరను తాకే దోమలను అక్కడికక్కడే హతమారుస్తుంది. మనుషులను ఏమాత్రం హానికారకం కాని, కనిష్టంగా రెండేళ్ల పాటు దోమ తెరపై ఉండే ఈ రసాయనం దోమల నివారణకు తోడ్పడుతుంది.



లార్వా నివారణకు....

ఆదిలోనే అంతం చేసే విధానాలను లార్వా నివారణలో వినియోగిస్తున్నారు అధికారులు. అందులో రెండు రకాల విధానాలు ఉన్నాయి. గంబూషియా చేపపిల్లలను శుభ్రం చేసేందుకు అవకాశంలేని నీటి నిల్వల్లో వదులుతారని డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి అన్నారు. వీటి ఆహారమే లార్వా కావడంతో దోమ పుట్టుకదశలోనే అంతమవుతుంది. గడచిన రెండేళ్లుగా ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న డ్రైడే.. ఫ్రైడే విజయవంతమైందని జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ రోణంకి రమేష్ అన్నారు. దోమల సాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో గృహ దర్శనాలు నిర్వహించి నిల్వ నీటి శుద్ధి, పరిసరాల పరిశుభ్రతపై నిర్వాసితులు, ముఖ్యంగా గృహిణులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఆచరణలో సఫలం.. అంకెల్లో విజయం..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2019– 22 మధ్య దోమల నివారణకు వినియోగించే దోమ తెరల పంపిణీ కట్టుదిట్టంగా జరిగింది. 2019లో 1,14,050 కుటుంబాలకు, 2020లో 87,839 కుటుంబాలకు 2021,22లో 3,79,300 కుటుంబాలకు దోమ తెరల పంపిణీ చేపట్టారు. గతఏడాది 29 పీహెచ్‌సీల పరిధిలో 640 గ్రామాల్లో 2,26,580 జనాభాకు గాను 2,22,146 మంది ఇళ్లల్లో ఇండోర్ రెసిడ్యుయల్ స్ప్రే చేపట్టారు. 98 శాతం మంది ఈ ప్రయోజనాన్ని పొందారు. 2019లో 646 మలేరియా కేసులు నమోదు కాగా, 2020లో 278 నమోదయ్యాయి. 2021లో 96 కేసులు నమోదైతే, 2022లో 115, 2023 ఏప్రిల్ 16వ తేదీ వరకు 71 కేసులు నమోదైనట్లు డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి తెలిపారు.

నినాదమే.. విధానం..

ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఈ ఏడాది కీలక నినాదాన్ని ప్రతిపాదించిందని కాకినాడ జిల్లా మలేరియా అధికారి భాస్కరరావు తెలిపారు. జీరో మలేరియా లక్ష్యం దిశగా ఆచరణ, అమలు, ఆవిష్కరణ అనే ప్రతిపాదనను జనాల్లోకి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. థింక్ గ్లోబల్లీ (ఆలోచన అంతర్జాతీయం), ప్లాన్ లోకల్లీ(ప్రణాళిక స్థానికం), యాక్ట్ ఫోకల్లీ(చర్యలు కేంద్రీకృతం) అనే ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గ నిర్దేశంలో మలేరియా నివారణకు వివిధ కార్యక్రమాలు రూపకల్పన చేసి అమలు చేస్తున్నట్లు తెలిపారు.

రెడ్ క్రాస్ సొసైటీకి విరాళాలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రజలు ప్రతి ఒక్కరూ వీలైనంత మేర సమాజ సేవలో భాగస్వాములు కావాలని కలెక్టర్ మాధవీలత పిలుపు నిచ్చారు. రాజమహేంద్రవరానికి చెందిన డాక్టర్ డాక్టర్ అజమ్తుల్లా బేగ్..ఆయన కుమారుడు మహమ్మద్ గౌస్ నవాజ్ బేగ్‌లు రెడ్‌క్రాస్ సొసైటీకి సోమవారం రూ.1,01,116 కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. వాటిని సమర్థవంతంగా చేపట్టేందుకు ప్రజల సహకారం అవసరమన్నారు. రెడ్ క్రాస్ సొసైటీకి విరాళాలు అందించిన బేగ్ కుటుంబ సభ్యులను కలెక్టర్ అభినందించారు. జీఎస్ఎల్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ గన్ని భాస్కర రావు తన వంతు సహాయంగా లక్ష రూపాయలు అందించారన్నారు. మరికొందరు స్ఫూర్తి పొంది ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్వో జి. నరసింహులు, తహశీల్దార్ సుస్వాగతం పాల్గొన్నారు.

రుణగొణ ధ్వనులకు మంగళం

- మహిళా సంఘాల లెక్క..ఇక పక్కా
- పొదుపు..రుణ వివరాల్లో పారదర్శకత
- మే నుంచి అందుబాటులోకి 'లోకోస్' యాప్ సేవలు
- వినియోగంపై వీవోఏ, ఏపీఎం, సీసీలకు శిక్షణ
- కోనసీమ జిల్లాలో 38,450 మహిళా శక్తి సంఘాలు



మహిళా శక్తి సంఘాల సభ్యులు

రాయవరం: పొదుపు సంఘాల లెక్కలు ఇకపై పక్కాగా ఉండనున్నాయి. సంఘంలోని మహిళలు పొందే రుణాలు, వారు చెల్లిస్తున్న వడ్డీ, సంఘాల కార్యకలాపాలు, పొదుపు వివరాల్లో పూర్తి పారదర్శకత చోటు చేసుకోనుంది. ఎక్కడా లోపం లేకుండా పర్యవేక్షణ జరుగనుంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఈ నూతన అప్లికేషన్‌ను రూపొందించింది. డ్వాక్రా సంఘాల్లో జరుగుతున్న ఆర్థికాభివృద్ధి, ప్రభుత్వ పథకాలపై అవగాహన, వారు నిర్వహిస్తున్న వ్యాపారం, పొందుతున్న లాభాలు తదితర సమాచార వివరాల పక్కాగా ఉండే విధంగా కొత్తగా 'లోకోస్' అనే యాప్‌ను మే నెల నుంచి అందుబాటులోకి తీసుకురానున్నారు. దేశవ్యాప్తంగా పొదుపు సంఘాల వివరాలన్నీ ఈ యాప్ ద్వారా ఒకే గొడుగు కిందకు రానున్నాయి. గ్రామీణ జీవనోపాదుల మిషన్ (నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్) ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

వేర్వేరు యాప్‌లకు స్వస్తి

ఇప్పటి వరకు పొదుపు సంఘాల వివరాలను వేర్వేరు యాప్‌ల్లో నమోదు చేస్తున్నారు. సంఘాల పనితీరు..ఆర్థిక లావాదేవీలు, ఇతర వివరాల నమోదుకు ఒక్కో యాప్‌ను వినియోగించేవారు. మహిళా శక్తి సంఘాల్లోని సభ్యుల వ్యక్తిగత వివరాలు, వారి ఆర్థిక పరిస్థితి, సంఘాల ఆర్థిక లావాదేవీలన్నీ ఇకపై ఒకే యాప్‌లో నమోదు చేయనున్నారు. దీని వలన సమగ్ర సమాచారం ఒకేచోట లభిస్తుంది. డిజిటలైజేషన్‌లో భాగంగా ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత

ప్రధానంగా పొదుపు సంఘాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న ఆర్థిక రుణాలపై పారదర్శకత ఉండే విధంగా ఈ యాప్ ఉపయోగపడనుంది. భవిష్యత్తులో ఆధార్ ప్రామాణికంగా రుణాలు మంజూరయ్యే అవకాశముంది. ఎక్కడైనా రెండు, మూడు సంఘాల్లో సభ్యులుగా ఉంటూ, వేర్వేరు చోట్ల రుణాలు పొందడానికి ఇకపై అవకాశముండదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 38,450 మహిళా శక్తి సంఘాలున్నాయి. ఈ సంఘాల్లో 3,99,333 మంది సభ్యులుగా ఉన్నారు. సంఘాల్లో ఉన్న సభ్యులు తీసుకుంటున్న రుణాలు, చెల్లిస్తున్న రుణ వాయిదాలకు సంబంధించిన వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. దీనివల్ల ఎక్కడా లోపం లేకుండా పర్యవేక్షణ సులువుగా ఉంటుంది. తద్వారా పనిభారం తగ్గి సమయం కలసి వస్తుంది. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో, వైఎస్సార్ క్రాంతి పథం సంస్థ సారథ్యంలో స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు పర్యవేక్షిస్తారు. ఇకపై మహిళా శక్తి సంఘాల సమాచారంతో పాటు, గ్రామ సంఘాల సమాచారం కూడా ఈ యాప్ ద్వారానే పర్యవేక్షిస్తుంటారు.

త్వరలోనే శిక్షణ పూర్తి

ప్రస్తుతం లోకోస్ యాప్ వినియోగంపై రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన జిల్లా రీసోర్స్ పర్సన్స్ ఎంవీఎల్ కుమారి, డి.వరాలబాబు, జి.దుర్గాప్రసాద్, టి.జోగారావు, హైమాప్రశాంతి, సాయికుమారి శిక్షణనిస్తున్నారు. గ్రామ సంఘాల అసిస్టెంట్లు (వీవోఏ), అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు (ఏపీఎం), క్లస్టర్ కోఆర్డినేటర్ల (సీసీ)కు జిల్లా స్థాయిలో శిక్షణనిస్తున్నారు. ప్రతి మండలం నుంచి ముగ్గురు వీవోఏలు, ఒక్కొక్క ఏపీఎం, సీసీలకు శిక్షణ ఇస్తున్నారు. లోకోస్ యాప్ ప్రధాన ఉద్దేశం, యాప్‌ను ఎలా వినియోగించాలి? ఆర్థిక లావాదేవీలు ఎలా నమోదు చేయాలి? నమోదు అనంతరం నివేదికలను ఎలా పరిశీలించాలి? తదితర అంశాలపై మూడు రోజుల వంతున శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని సఖినేటిపల్లి, రాజోలు, మలికిపురం, మామిడికుదురు, పి.గన్నవరం, అల్లవరం, అమలాపురం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, ఐ.పోలవరం మండలాలకు ఐదుగురి వంతున 55 మందికి శిక్షణ పూర్తి చేశారు. ఈ నెల 25 నుంచి 27 వరకు కొత్తపేట, అయినవిల్లి, ఆలమూరు, అంబాజీపేట, ఆత్రేయపురం, రావులపాలెం, కె.గంగవరం, కపిలేశ్వరపురం, మండపేట, రామచంద్రపురం, రాయవరం మండలాల పరిధిలోని వారికి శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పొందిన వీవోఏలు, ఏపీఎం, సీసీలు తిరిగి మండల స్థాయిలో గ్రామ సంఘాల సహాయకులకు శిక్షణ ఇస్తారు.

'లోకోస్' యాప్ లోగో

ఒకే యాప్‌లో సమగ్ర సమాచారం



లోకోస్ యాప్ వల్ల పొదుపు సంఘాల సమగ్ర సమాచారం ఒకచోటే లభిస్తుంది. యాప్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకుని రాగానే పొదుపు సంఘాల సమాచారాన్ని అందులో నమోదు చేస్తాం. దీనివల్ల సంఘాలు, సభ్యులకు సంబంధించిన పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుంది. ఇది వరకు వేర్వేరు యాప్‌ల్లో నమోదు చేయడం ద్వారా వాటిని సేకరించేందుకు సమయం పట్టేది. ప్రస్తుతం ఈ యాప్‌తో అటువంటి సమస్య ఉండదు.

– డాక్టర్ డి.శివశంకరప్రసాద్, పీడీ, డీఆర్‌డీఏ, అమలాపురం

క్లుప్తంగా

శ్రీ ప్రకాష్ స్కూల్ స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): శ్రీ ప్రకాష్ సురేష్‌నగర్ పాఠశాల 3, 5 తరగతుల విద్యార్థుల స్నాతకోత్సవం సోమవారం సాయంత్రం నిర్వహించారు. వాయిస్ ఆఫ్ స్పీడ్ ట్రైనర్, డైరెక్టర్ జిల్‌మిల్ హాజరికా ముఖ్యఅతిథిగా హాజరై షేక్ స్పియర్ రచించిన హ్యామ్లెట్, గ్రీకు రచయిత యూరిపిడస్ రచించిన మీడియా రెండింటిని కలిపి స్త్రీ సాధికారత కోసం రచించిన కిల్ నాట్ టు కిల్ అనే నాటకం ప్రదర్శించారు. మరో ముఖ్య అతిథి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా డైరెక్టర్ అభిలాష్ పిళ్లై (కేరళ) మాట్లాడుతూ చిన్న వయస్సులో ఏవిషయాలపై ఆసక్తి ఉందో గ్రహించి వారిని ఆ విధంగా ప్రోత్సహించాలన్నారు. స్మార్ట్ షేక్‌స్పియర్, రాకింగ్ రామానుజన్, నంబర్ క్రంచర్, పద్య యోధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డాక్టర్ శివప్రసాద్, పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్, ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, ఎం.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వీరేశ్వరుని బ్రహ్మోత్సవాలు ఆరంభం



పసుపును దంచుతున్న ముత్తయిదువలు



భద్రపీఠంపై కొలువుదీరిన స్వామి, అమ్మవారు

ఐదు రోజులు అలరించనున్న ఆధ్యాత్మిక సంబరాలు

ఐ.పోలవరం: నిత్యకళ్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందుకు నాందిగా గ్రామంలోని మహిళలు ఆలయ ఆవరణలో పసుపు కొమ్ములను రోకట్లో దంచారు. శైవాగమ పద్ధతిలో స్వర్ణ రుద్రాక్ష కంకణ, స్వర్ణ సింహతలాట సన్మాన గ్రహీత, రాష్ట్ర ఆదిశైవ అర్చక సంఘ అధ్యక్షుడు యనమండ్ర సత్యసీతారామ శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చక స్వాముల, అధికారుల పర్యవేక్షణలో ఈ అయిదు రోజుల క్రతువుకు శ్రీకారం చుట్టారు. ఆలయంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను నూతన వధూవరులను చేశారు. అనంతరం పండితులు పంచామృతాలతో స్వామి వారికి, అమ్మవారికి స్నానాలు చేయించారు. బ్రహ్మోత్సవ కల్యాణ మూర్తులకు జంపన రామకృష్ణ దంపతులు పట్టు వస్త్రాలు అందజేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో అంకురారోపణ, అగ్ని ప్రతిష్ఠాపన నిర్వహించారు. స్వామి అమ్మవార్లను భద్రపీఠంపై ఉంచి ప్రత్యేక అలంకరణలో గ్రామోత్సవాన్ని కన్నుల వైకుంఠంగా నిర్వహించారు. అనంతరం ఎదురు సన్నాహం, స్వామి వారి ఆలయ ప్రదక్షిణ సాగింది. నిత్యం జరిగే స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కల్యాణ మహోత్సవానికి వందలాది మంది భక్తులు హాజరయ్యారు. ఆలయ ఆవరణ చలువ పందిళ్లు, యాగశాల, విద్యుత్ దీపాలంకరణ తదితరాలతో ఆలయం కల్యాణ శోభతో మెరిసిపోయింది. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లను ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

చంద్రబాబు అన్యాయాన్ని
బీసీలు ఎప్పటికీ క్షమించరు..

మంత్రి వేణు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు

రామచంద్రపురం: రాష్ట్రంలో బీసీలకు చంద్రబాబు నాయుడు చేసిన అన్యాయాన్ని బీసీలు ఎప్పటికీ క్షమించరని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకు అన్నీ తెలుసు అని భ్రమింపజేయడానికి లోకేష్ మాట్లాడుతున్నారన్నారు. ఈనాడు పత్రికలో 'బీసీ సంక్షేమానికి ఎంత ఖర్చు చేశారు' అంటూ లోకేష్ వ్యాఖ్యలపై మంత్రి వేణు స్పందించారు. లోకేష్‌కు రాసిచ్చింది చదవడం మాత్రమే తెలుసు అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు వద్దకు మత్స్యకారులు వెళ్లి తమ సమస్య చెప్పుకుంటే తోలు తీస్తానన్నాడన్నారు. నాయీ బ్రాహ్మణులు వెళితే తోకలు కత్తిరిస్తానన్నారు. కానీ జగనన్న పాలనలో ఏ గుడి మెట్ల మీద సేవలు అందించాడో ఆ గుడికి నాయీబ్రాహ్మణుడు పాలకుడు కాబోతున్నాడన్నారు. దివిటీలు పట్టిన రజకులు చైర్మన్లు అవుతున్నారన్నారు. ఐటీ బూమ్ తెచ్చింది నేనే అని గొప్పలు చెప్పుకునే నీ తండ్రి, నువ్వు మహానేత రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్సుమెంటు ద్వారా బీసీలు ఇంజినీర్లుగా, డాక్టర్లుగా ఎదిగారని గుర్తుంచుకోవాలన్నారు. మీ పాలనలో చేతివృత్తి పనిముట్లు అరకొరగా అందించి వాటి కోసం కూడా జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లు అరిగేలా తిప్పుకునేవారని, కానీ జగనన్న పాలనలో అవినీతికి తావులేకుండా, ఎవరినీ ఆశ్రయించాల్సిన పనిలేకుండా నవరత్నాల పథకాల ద్వారా ప్రతీ బీసీ కులానికి చెందిన వారికీ నేరుగా వారి ఖాతాలోనే ఆర్థిక సాయం జమ చేస్తూ వారి ఎదుగుదలకు బాటలు వేస్తున్నామన్నారు. బీసీలు జడ్జీలుగా పనికిరారన్న బీసీ ద్రోహి నీ తండ్రి అయితే బీసీలను ఉప ముఖ్యమంత్రులుగా, రాజ్యసభ సభ్యులుగా, కార్పొరేషన్ల చైర్మన్లుగా రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అన్ని విధాలుగా ఎదిగేలా చేస్తున్న బీసీ పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని గుర్తుంచుకోవాలన్నారు.

ఘనంగా వైదిక కార్యక్రమాలు



వైదిక కమిటీ సభ్యులకు సూచనలిస్తున్న ఈఓ చంద్రశేఖర్ అజాద్

అన్నవరం: ఈ నెల 30వ తేదీ నుంచి జరగనున్న సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో స్వామి, అమ్మవార్లకు నిర్వహించే వైదిక పరమైన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ ఆదేశించారు. సోమవారం ఆయన దేవస్థానం వేద పండితులు, అర్చకులతో సమావేశమయ్యారు. 30వ తేదీన స్వామి, అమ్మవార్లను వధూవరులను చేసే కార్యక్రమం మొదలుకుని మే ఒకటో తేదీన సత్యదేవుని దివ్యకల్యాణం, రెండో తేదీ అరుంధతి దర్శనం, మూడో తేదీన వేదపండిత సదస్యం, నాలుగో తేదీన వనవిహారం, ఐదో తేదీన చక్రస్నానం, ఆరో తేదీన శ్రీపుష్పయాగం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలకు అవసరమైన పూజా సామగ్రిని ముందుగానే సమకూర్చుకోవాలని ఆదేశించారు. సమావేశంలో వైదిక కమిటీ సభ్యులు వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టి శివ, ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్, స్పెషల్ గ్రేడ్ వ్రత పురోహితుడు ముత్య సత్యనారాయణ, కల్యాణబ్రహ్మ ఛామర్తి కన్నబాబు పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం



విలేకరులతో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామయ్య

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఏడవ రాష్ట్ర మహాసభలు విజయవంతం అయ్యాయని, 72 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని యూనియన్ నాయకులు తెలిపారు. సోమవారం రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఏపీ సహకార సంఘాల ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట వెంకటరామయ్య, కొల్లి సత్యనారాయణ మాట్లాడారు. ఉద్యోగుల హెచ్ఆర్ పాలసీ, జీవో 36 ప్రకారం జీతాల అమలు, జిల్లా స్థాయి సపోర్ట్ ఫండ్ ఏర్పాటు, 2019 నాటికి జరగవలసిన వేతన సవరణ అమలు, సహకార సంఘాలకు ప్రతిబంధకంగా ఉన్న ఇన్‌కంటాక్స్, టీడీఎస్‌లకు పూర్తి మినహాయింపు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. డ్యూటూ పద్దులను రద్దు చేయాలని కోరారు. ప్రైవేటు వ్యక్తులకు 50 శాతం షేర్స్‌ను కట్టబెట్టడం తగదని మహాసభ ఏకగ్రీవంగా వ్యతిరేకించిందని చెప్పారు.

నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక

యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా పి.అజయకుమార్, రాష్ట్ర అధ్యక్షుడిగా తోట వెంకటరామయ్య, ప్రధాన కార్యదర్శిగా కొల్లి సత్యనారాయణ, కోశాధికారిగా పెంకే సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా గిరిబుచ్చి రంగనాథం, కడగల ఆదినారాయణరావు, కొడవలి వీర వెంకట సత్యనారాయణ, వి.మనోజ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి



రామకృష్ణ మృతదేహం

ప్రత్తిపాడు: చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన ప్రత్తిపాడు మండలం గజ్జనపూడి గ్రామంలో సోమవారం జరిగింది. స్థానిక పోలీసుల కథనం మేరకు తుని మండలం ఎస్.ఎస్.వెంకటనగరం గ్రామానికి చెందిన పంపనబోయిన రామకృష్ణ (35) కొంతకాలంగా ప్రత్తిపాడు మండలం గజ్జనపూడి గ్రామంలో బంధువుల ఇంట నివసిస్తున్నాడు. సోమవారం తాటాకుల కోసం గ్రామానికి చెందిన జంపన రాంబాబు పొలంలోని తాటిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రత్తిపాడు ఎస్సై ఎం. పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో..



ఘటనాస్థలం వద్ద మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పిఠాపురం: మండలంలోని జల్లూరు వద్ద పిఠాపురం – సామర్లకోట రోడ్డులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందినట్లు పిఠాపురం రూరల్ పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం గొల్లప్రోలు కొత్తపేటకు చెందిన కసిరెడ్డి శివకుమార్ పెద్దాపురంలో ఒక కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం తన మోటారు సైకిల్‌పై పెద్దాపురం వెళుతుండగా పిఠాపురం మండలం జల్లూరు వద్ద పిఠాపురం సామర్లకోట రోడ్డులో ఒక్కసారిగా గేదె అడ్డురాగా సడన్ బ్రేక్ వేయడంతో కింద పడిపోయాడు. ఇంతలో సామర్లకోట నుంచి పిఠాపురం వెళుతున్న గుర్తుతెలియని మోటారు సైకిలిస్టు ఢీకొట్టడంతో శివకుమార్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే పడిపోయాడు. ఇంతలో స్థానికులు వచ్చి అతనిని తీసి పక్కనే ఉన్న చెట్టు కింద పడుకోబెట్టి అంబులెన్సుకు సమాచారం ఇవ్వగా 108 సిబ్బంది వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. అతని తండ్రి కసిరెట్టి కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పిఠాపురం రూరల్ ఎస్సై అబ్దుల్‌నబీ తెలిపారు.

కళ చల్ల'కుండ'



పెద్దాపురంలో శిల్పి సాయి తయారు చేసిన అతి చిన్న మట్టి కుండ

పెద్దాపురం: మండు వేసవిలో చల్లని నేస్తం కుండ.. దానిని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ అవార్డు గ్రహీత, పెద్దాపురం పట్టణ బంగారు శిల్పి తాళాబత్తుల సాయి అతి సూక్ష్మంగా తయారు చేసి ఆకట్టుకున్నారు. రెండు గంటల వ్యవధిలో 100 మిల్లీ గ్రాముల బంక మట్టితో కుండను తయారు చేశారు. ఇది అందరినీ ఆకర్షిస్తోంది.

జూదరుల అరెస్ట్

కరప: మండలం జి.భావారంలో పేకాట శిబిరంపై కరప పోలీసులు దాడి చేసి, ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. కరప ఎస్ఐ నౌడు రామకృష్ణ కథనం మేరకు జి.భావారం గ్రామ పొలిమేరలో పేకాటాడుతున్నట్టు సోమవారం కరప పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో వెళ్లి పేకాట శిబిరంపై దాడి చేశారు.

ముగ్గురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.4,910 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, నిందితులను కాకినాడ కోర్టులో హాజరుపరచినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఆత్మహత్యకు పాల్పడ్డ యానిమేటర్?

రాయవరం: మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డ వివాహిత ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం. అయితే వివాహిత మృతి చెందగా, ఇద్దరు చిన్నారులు కోలుకుంటున్నట్లు తెలిసింది. వివాహిత ఆత్మహత్యకు ఎందుకు పాల్పడిందన్న విషయం తెలియరాలేదు. ఆత్మహత్యకు పాల్పడ్డ మహిళ డ్వాక్రా యానిమేటర్‌గా పనిచేస్తున్నట్లు తెలియవచ్చింది.